క్లుప్తంగా

30న సర్వసభ్య సమావేశం

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో 30న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు బుధవారం చైర్మన్ వై. సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సంఘం ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

పల్లెలను కమ్మేసిన పొగమంచు



ఎన్కేపల్లిలో కురుస్తున్న పొగమంచు

మోమిన్‌పేట: పల్లెలు, పంట పొలాలను పొగమంచు కమ్మేసింది. బుధవారం ఉదయం 8గంటల వరకు సూర్యుడిని కప్పేశాయి. నిన్నటి వరకు దంచి కొట్టిన వానలు, వెంటనే పొగ మంచు కురవడంతో పత్తికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

దౌల్తాబాద్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పాడైన రోడ్లను ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కృషితో అభివృద్ధి చేపడుతున్నట్లు జెడ్పీటీసీ మహిపాల్ అన్నారు. బుధవారం మండలంలోని అంతారం గ్రామంలో ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మండలంలో తండాలకు బీటీరోడ్లు మంజూరు చేసి ప్రారంభించామని, అలాగే గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుంది. కావునా రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రమోద్‌రావు, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నరోత్తంరెడ్డి తదితరులున్నారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

అనంతగిరి: రాహుల్‌గాంధీపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వాహిద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్ గాంధీ చేసిన భారత జూడో పాదయాత్రను ప్రపంచమంతా ప్రశంసిస్తుంటే ఓవైసీ మాత్రం విమర్శించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం సంక్షోభంలో కూరుకుపోయిందని, అయినా ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీల పేరుతో రాజకీయం చేయడం సరికాదన్నారు.

ఓటర్ జాబితాపై సూచనలు, సలహాలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్ రూరల్ : ఓటరు నమోదు జాబితా పూర్తయిన క్రమంలో బుధవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విజయ కుమార్ అధ్యక్షతన అఖిపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పలు సూచనలు అందజేశారు. అక్టోబర్ 4వ తేదీన ఓటరు తుది జాబితా విడుదలవుతుందని, అందులో ఏమైనా సవరణలు ఉన్నట్లయితే కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ప్రతి పోలింగ్‌బూత్‌లో ప్రతి పార్టీ నుంచి ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో దుద్యాల ఎంఆర్‌ఓ ఆనందర్‌రావు, స్థానిక రెవెన్యూ సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ సురేష్, శివకుమార్, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి



సమావేశానికి హాజరైన నాయకులు

పరిగి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పూర్వ అధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 1న ప్రధాని నరేంద్రమోదీ మహబూబ్‌నగర్‌కు వస్తున్నా సందర్భంగా సభకు కార్యకర్తలు తరలి వెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఘనపురం వెంకటయ్య, మిట్టపరమేశ్వర్‌రెడ్డి, మారుతికిరణ్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- మరమ్మతుకు నోచుకోని తారురోడ్లు
- ప్రమాదాలకు నిలయాలుగా రహదారులు
- నిధులు మంజూరైనా పట్టని వైనం



గుంతలమయంగా వడిచర్ల-కొత్తూరు రోడ్డు



దుప్‌చర్ల-బొంరాస్‌పేట బీటీ రోడ్డు దుస్థితి

బొంరాస్‌పేట: నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది.. ఎడతెరిపి లేని వర్షాలతో గుంతల్లో నీళ్లు నిలిచి రోడ్లు మరింత ధ్వంసం అవుతున్నాయి. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎక్కడ గుంత.. ఏదీ రోడ్డు .. తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని తారురోడ్లు రోజు రోజుకు పూర్తిగా పాడైయ్యాయి. నిధులు మంజూరైన రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో మట్టిరోడ్లుగా తయారవుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

మండల పరిధిలోని బొంరాస్‌పేట నుంచి మదన్‌పల్లి వరకు, కొడంగల్ నుంచి ఎన్కేపల్లి వరకు, బొంరాస్‌పేట నుంచి ముద్దాయిపేట మీదుగా దుప్‌చర్ల వరకు బీటీరోడ్లు ఉన్నాయి. బాపల్లి నుంచి దుద్యాల మండలం నాజ్‌ఖాన్‌పల్లి వరకు 13 కిలో మీటర్లు, అలాగే తుంకిమెట్ల నుంచి నాందార్‌పూర్, బాపల్లి మీదుగా దుద్యాల మండలం ఈర్లపల్లి వరకు డబుల్ రోడ్డు ఉంది. కాగా, 2009లో వేసిన బొంరాస్‌పేట-మదన్‌పల్లి బీటీ రోడ్డు పూర్తిగా చిద్రం అయింది. నాణ్యతలేని కారణంగా వేసిన ఏడాదికే గుంతలమయంగా మారింది.

అస్తవ్యస్తంగా వడిచర్ల రోడ్డు..

గతంలో విచ్చలవిడిగా సాగిన అక్రమ ఇసుక రవాణా కారణంగా మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి-వడిచర్ల బీటీ రోడ్డు ప్రస్తుతం మట్టిరోడ్డుగా మారింది. రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ రోడ్డు మరమ్మతు కోసం మంత్రుల విన్నతులు, పాదయాత్రలు, రాస్తారోకోలు చేసినా ఫలితం శూన్యం. బీటీ రోడ్లకు మరమ్మతు చేసి తమ సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

పదేళ్లుగా కష్టాలు



ఇరవై ఏళ్ల క్రితం వేసిన కొత్తూరు, వడిచర్ల బీటీ రోడ్డు పాడైంది. బీటీ రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారింది. ఇదివరకు రెండు జిల్లాల సరిహద్దుల రోడ్డు కావడంతో ఎంతమంది వేడుకున్నా ఫలితం ఉండేదికాదు. ప్రస్తుతం ఒకే జిల్లాలోకి వచ్చినా పరిస్థితి మారడం లేదు.. ఎవరికి చెప్పుకున్నా రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదు..

–గౌసోద్దిన్,వడిచర్ల

నిధుల కోసం కృషి



మండలంలో పాడైన బీటీరోడ్లు, మట్టిరోడ్ల మరమ్మతు కోసం నిధులు మంజూరు కోసం చేస్తున్నా. అంతర్గత బీటీరోడ్లు, చౌదర్‌పల్లి మీదుగా నాందార్‌పూర్ నుంచి హంసాన్‌పల్లి గ్రామాలకు కొత్తగా బీటీ రోడ్డు వేశాం. తాజాగా కొన్ని గిరిజన తండాలకు మట్టిరోడ్లకు బదులు బీటీరోడ్ల కోసం నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

–అరుణదేశు, జెడ్పీటీసీ,బొంరాసిపేట

ఆయుష్మాన్ భవతో రూ.5 లక్షల ఆరోగ్య బీమా



ప్రతిజ్ఞ చేస్తున్న సూపర్‌వైజర్ అమరేశ్వరి, తదితరులు

మర్పల్లి: 'ఆయుష్మాన్ భవ' హెల్త్ కార్డుతో ప్రతి ఒక్కరూ రూ.5 లక్షల ఆరోగ్య బీమా పొందవచ్చని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ అమరేశ్వరి అన్నారు. ఈ పథకం కింద సుమారు 1,650 రకాల రోగాలకు బీమా వర్తించనుందని స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని కొత్లాపూర్‌లో ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం సర్పంచ్ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భవ అమలుపై ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి సొంత డబ్బులు వెచ్చించి వైద్య చేయించుకోని, అనంతరం ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డుతో రూ.5 బీమా పొందవచ్చన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ పథకానికి అర్హులన్నారు. అనంతరం ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డుకు సంబంధించిన కరపత్రాలను చదివి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ రాములు, కార్యదర్శి చందు, వార్డు మెంబర్లు అఖిల, శ్రీనివాస్, ఏఎన్ఎం వసంత ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకట్

మోమిన్‌పేట: ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్ అన్నారు. బుధవారం మోమిన్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం అందుతుందన్నారు. రైతుబంధు, బీమా, రుణమాఫీ, పంటలకు మద్దతు ధరకే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దళితులను వ్యాపార రంగంలో చూడాలని యూనిట్‌కు రూ.10లక్షలు ఇస్తున్నారని తెలిపారు. కులవృత్తులకు, మైనార్టీలకు రూ.లక్ష సాయం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మైబల్లి, శోభన్, సురేష్, లాలు, నవీన్‌కుమార్, రమేశ్, కాంతారావు, రవితేజ, ప్రశాంత్, సాయికుమార్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐకి పరామర్శ



యాదయ్యతో మాట్లాడుతున్న ఎస్పీ, తదితరులు

అనంతగిరి: ఇటీవల తాండూరులో బందోబస్తు విధులు నిర్వహించి వికారాబాద్ వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంతో గాయపడిన ఎస్సై యాదవ్‌ను జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పరామర్శించారు. ఎస్పీ, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్‌లతో బుధవారం సాయంత్రం వికారాబాద్‌లోని యాదయ్య ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

మూగ రోదన

- అంతుచిక్కని రోగాలతో బాధపడుతున్న పశువులు
- పత్తాలేని పశువైద్యాధికారులు
- లబోదిబోమంటున్న రైతులు



నాగులపల్లిలో పశువులకు వచ్చిన మచ్చలను చూపిస్తున్న రైతు



జబ్బుతో బక్కచిక్కిన దూడ

పెద్దేముల్: అంతుచిక్కని రోగాలతో పశువులు బాధపడుతున్నా పశువైద్యాధికారులు పట్టించుకోవడం లేదని నాగులపల్లి రైతులు వాపోతున్నారు. గత పది రోజుల నుంచి దూడలకు, ఆవులకు శరీరంపై బొబ్బలు రావడం, మేతలు మేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మండలానికి ఇద్దరు డాక్టర్లు ఉండేవారు. ఒకరు బదిలీపై వెళ్లగా మరో డాక్టర్ అందుబాటులో ఉండటం లేదని పలు గ్రా మాల రైతులు చెబుతున్నారు. దీంతో జీవాలకు ఏ రోగం వచ్చినా నాటు వైద్యం చేయించక తప్పడం లేదని అంటున్నారు. నాగులపల్లి గ్రామానికి 3 కిలో మీటర్ల దూరంలోని గోపాల్‌పూర్‌లో పనిచేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ ఉషా వికారాబాద్‌కు బదిలీ అయ్యింది. ఇంతవరకు ఆమె స్థానంలో మరో డాక్టర్‌ను ప్రభుత్వం నియమించపోవడంతో అక్కడ పశువుల వైద్య కేంద్రం మూతపడింది. దీంతో పశువులు రోగాల బారిపడి మృత్యువాత పడుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని నాగులపల్లి, రుద్రారం, నర్సపూర్‌తో పాటు పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలు మార్లు పశువైద్యాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.. ఉన్న ఒక్క డాక్టర్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతాడో తెలియడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మరి కొంత మంది రైతులు కర్ణాటక రాష్ట్రం కుంచారం, షాదీపూర్‌ల నుంచి ప్రైవేట్ డాక్టర్లను తీసుకొచ్చి పశువులకు వైద్యం చేయిస్తున్నారు. కనీసం ఉన్న సిబ్బందికి సమయపాలన లేకుండా పోయిందని, ఇష్టం వచ్చినట్లు విధులకు వస్తున్నారని, ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మూగ జీవాలకు వైద్యం సక్రమంగా అందేలా చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

సభను ఆషామాషీగా తీసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

బంట్వారం: అధికారులు బాధ్యతగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. బుధవారం బంట్వారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై శాఖా పరమైన చర్యలకు కలెక్టర్‌కు లేఖ రాస్తామన్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని కూడా కొందరు అధికారులు ఆషామాషీగా తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు సరియైన సమాచారంతో హాజరు కావాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ పైపులు లీకేజీలు లేకుండా చూడాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. తాండూరు-సదాశివపేట బస్సును రొంపల్లి మీదుగానే నడపాలని ఎంపీటీసీ శ్రీకాంత్ రెడ్డి ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ స్తంభాలు విరిగిపడిన కొత్తవి నాటడం లేదంటూ మాలసోమారం సర్పంచ్ నర్సింహారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. క్రీడా ప్రాంగణాల బిల్లులు చెల్లించడం లేదని యాచారం ,సుల్తాన్‌పూర్ సర్పంచ్‌లు బల్వంత్‌రెడ్డి , బర్కత్‌పల్లి నర్సింలు ప్రశ్నించారు. వైద్య ఆరోగ్య , పశు సంవర్ధక శాఖల పని తీరు అధ్వానంగా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు సభలో ధ్వజమెత్తారు. తప్పుడు నివేదికలతో సరిపెడుతున్నారంటూ ఆ శాఖల అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య ,ఎంపీఓ విజయ్‌కుమార్ ,సూపరింటెండెంట్ షిండే ,ఎంఈఓ చంద్రప్ప ,ఎఓ సంధ్య ,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి ,ఎఈ వేణు మాధవ్ ,ఎపీఓ సుధాకర్ ,ఎపీఎం దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు రుణాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

- రూ.లక్ష రుణమాఫీ ఎక్కడ?
- రూ. 2కోట్ల వరకు ధీర్ఘకాలిక రుణాలు
- పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్: అసైన్డ్ భూములకు ప్రభుత్వం పంట రుణాలు చెల్లించాలని, ఎఫ్ఎస్‌సీఎస్‌కు పర్మినెంట్ ఎండీని నియమించాలి.. రూ.లక్ష పంట రుణం అందించాలంటూ సర్వసభ్య సమావేశంలో రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం 20 రోజుల క్రితం ప్రకటించిన లక్ష రుపాయల రుణమాఫీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. బుదవారం పెద్దేముల్ రైతు సేవా, తట్టిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సర్వసభ్య సమావేశాలు తట్టిపల్లి చైర్మన్ లక్ష్మారెడ్డి, పెద్దేముల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. పెద్దేముల్ మండల తట్టిపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు దీర్ఘకాలిక రుణాల ద్వారా రూ.2లక్షల వరకు పంట రుణాలు అందించామన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకు అభివృద్ధితో పాటు ఎంత రుణమైన ఇచ్చేందుకు సులువుగా ఉంటుందన్నారు. జిల్లాలో వెనుకబడిన తట్టిపల్లిని అన్ని విధాల అభివృద్ధితో పాటు సకాలంలో ఎరువులు ఇచ్చేందుకు రూ.80లక్షల నాబార్డు నిధులతో ఎరువులు గోదాం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఆంజప్ప,మాజీ డీసీసీబీ డైరెక్టర్ నారాయణగౌడ్, పాలక మండి సభ్యులు ఉప్పరి మల్లెశం, నరేందర్, సీఈఓ రాజమౌళితో పాటు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేములో ...

రెండేళ్ల నుంచి పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో పర్మినెంట్ ఎండీ లేక సకాలంలో పంట రుణాలతో పాటు కనీస ఎరువులు, విత్తనాలు అందటం లేదని, వెంటనే పర్మినెంట్ ఎండీని నియమించాలని పలు గ్రామాల రైతులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే పావల వడ్డీ లభిస్తుందని, లేదా ఒక్క రుపాయి వడ్డీ పడుతుందని సంఘం డైరెక్టర్ నారాయణరెడ్డి, మేనేజర్ మురళీగౌడ్ తెలియచేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నారాయణరెడ్డి, వెంకటప్పతో పాటు మేనేజర్ మురళీగౌడ్, సంఘ సిబ్బంది ఫయాజ్,ప్రవీణ్, పెంటయ్య,నర్సిములు, మాణప్పతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



బీమా పత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. కార్మికులను ఎప్పటికప్పుడు ఆరోగ్యంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్మికులకు హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద మున్సిపల్‌లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రూ.2 లక్షల బీమా కూడా చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: ప్రభుత్వం అందిస్తున్న రైతు రుణమాఫీ పథకం రైతులందరికీ వర్తింపచేయాలని ప్రజాసంఘాల డిమాండ్ చేశాయి. బుధవారం మండల తహసీల్దార్, ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేశారు. రుణమాఫీ ఏకకాలంలో అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులకు సైతం వెంటనే రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ తదితరులున్నారు.

డిమాండ్లు నెరవేర్చండి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని నిరసనలు వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజక్టు కార్యదర్శి నవనీత, ఉపాధ్యక్షురాలు శివలీల పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లేశం



మెమోంటోలు, ప్రశంసా పత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయులు

బంట్వారం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుర్గంచెర్వు మల్లేశం అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు బుధవారం ఆయన ఎంపీపీ ప్రభాకర్‌తో కలిసి మండల కేంద్రంలో శాలువా , పూలమాలలతో సత్కరించి మెమోంటోలు ,ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు ఎక్కడైనా మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్ , ఎంపీడీఓ బాలయ్య , ఎంపీఓ విజయ్‌కుమార్ ,సూపరింటెండెంట్ షిండే , ఎంఈఓ చంద్రప్ప , షఫీ, రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం

తాండూరు రూరల్: రాష్ట్రంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మల్కాపూర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మిట్టబాసుపల్లి, గుంతబాసుపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మిట్టబాసుపల్లి గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. గుంతబాసుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మహబూబ్, మిట్టబాసుపల్లి అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ పెద్ద నర్సింలును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి ,పురుషోత్తంరెడ్డి, రాజ్‌కుమార్, లొంక నర్సింలు ఉన్నారు.

భక్తిపారవశ్యం



అన్నదానం చేస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి



దోమ: వినాయకుడిని పూజలు చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా గణనాథుల మండపాల వద్ద భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. పలు చోట్ల నిమజ్జనాలు, లడ్డూ వేలం పాటలతో సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో అన్నదానాలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని వినాయకుడికి మొక్కుకున్నారు. పలుచోట్ల వినాయక విగ్రహాలను ఊరేగింపుగా, ఆటపాటలతో నిమజ్జనాలకు తరలించారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్



రాములుకు లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు



కుల్కచర్ల: వినాయకుడికి పూజలు చేస్తున్న విద్యార్థులు